క్లుప్తంగా

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్: పట్టణంలో 2025–26 సంవత్సరానికి షెడ్యూలు కులాల వారికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి నిమిత్తం వివిధ పథకాల్లో ఆర్థిక సహాయం మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. ఈ పథకాలకు బ్యాంకుల ద్వారా రుణాలు, ప్రభుత్వ సబ్సిడీతో లబ్ధిదారులకు అందించేందుకు 25 యూనిట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. 23 రకాల కేటగిరీల్లో పథకాల మంజూరు ద్వారా రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న అభ్యర్థులు నేరుగా తమ తమ రైస్‌కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, మొబైల్ ఫోనుతో మీ– సేవ లేదా వార్డు సచివాయం ద్వారా తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హతలు, పథకం మంజూరుకు కావాల్సిన అనుభవం తదితర సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. దగ్గరలోని నెట్ సెంటరు లేదా మీ– సేవ సెంటరు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ రాజు సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తు జెరాక్సులను సంబంధిత వార్డు సచివాలయంలో మే 10 లోగా ఇవ్వాలని కమిషనర్ రాజు సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



ఎమ్మెల్యే అశోక్‌ను కలిసిన నూతన సీఐ అడలరసన్

యానాం: నియోజకవర్గ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని శుక్రవారం యానాం పోలీస్‌స్టేషన్ నూతన సీఐ ఎస్ అడలరసన్ పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించేందుకు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చిన అడలరసన్‌కు స్థానిక పూర్వపు సీఐ షణ్ముగం, ట్రాఫిక్ ఎస్సై నూకరాజు, ఏఎస్సై దాసరి పట్టాభిరామయ్య తదితరులు ఘనస్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ను సీఐ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



బండారులంకలో ఎస్‌డబ్ల్యూ పీసీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీపీవో

అమలాపురం రూరల్: రోగాలు ప్రబలకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోనసీమ జిల్లా పంచాయతీ అధికారిణి శాంత లక్ష్మి సూచించారు. మండలం బండారులంక గ్రామంలో ఎస్‌డబ్ల్యూ పీసీ (సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్) కేంద్రాన్ని శుక్రవారం డీపీవో తనిఖీ చేశారు. సర్పంచ్ పెనుమాల సునీత ఆధ్వర్యంలో ప్రజలకు సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాంత లక్ష్మి మాట్లాడుతూ తడి చెత్త – పొడి చెత్తను వేర్వేరుగా క్లాప్ మిత్రలకు అందించాలని కోరారు. కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీటీసీలు, స్థానికులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఊరేగింపు

ముమ్మిడివరం: స్థానిక శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి జన్మదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గ్రామ వీధుల్లో మేళ తాళాలతో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పేపర్ రహిత పాలనకు నిధుల మంజూరు

యానాం: పేపర్ రహిత పాలన (అడ్మినిస్ట్రేషన్ ప్రాజెక్టు) కోసం కేంద్ర ప్రభుత్వం పుదుచ్చేరి అసెంబ్లీకి రూ.8కోట్లు మంజూరు చేసిందని స్పీకర్ ఆర్ సెల్వం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పేపర్ రహిత అడ్మినిస్ట్రేషన్ దిశగా అన్ని లెజిస్లేటివ్ సెషన్స్ కార్యక్రమాలను, పనులన్నింటినీ కంప్యూటరైజ్ చేస్తామన్నారు. కోఆర్డినేషన్ కోసం ప్రత్యేక సెంటర్‌ను ఏర్పాటుచేసి పేపర్‌లెస్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ నిస్తామని తెలిపారు. అసెంబ్లీ కార్యదర్శి దయాళన్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అంబేడ్కర్

యానాం: దేశ పౌరులందరికీ సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, న్యాయం అందించాలన్న లక్ష్యంతో కృషి చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఎస్సీ, ఎస్టీ రైట్స్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ తాతపూడి ముత్యాలు, సభ్యులు డాక్టర్ మేడెపల్లి శాంతరాజు అధ్యక్షత వహించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కమిడి ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాలకు అండగా నిలిచిన ఫూలే

- కలెక్టర్ మహేష్‌కుమార్
- కలెక్టరేట్‌లో జ్యోతిరావు ఫూలేకు ఘన నివాళులు



కలెక్టరేట్‌లో పూలే చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న లంకా దినకర్, కలెక్టర్, మంత్రి సుభాష్, ఎంపీలు, ఎమ్మెల్సీలు తదితరులు



మహాత్మ జ్యోతిరావు పూలే చిత్ర పటానికి సెల్యూట్ చేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు, అధికారులు, సిబ్బంది

అమలాపురం రూరల్: అట్టడుగు వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన యోధుడు మహాత్మ జ్యోతిరావు ఫూలే ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతిని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటు 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తదితరులు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాయింట్ కలెక్టర్ టీ.నిశాంతి ప్రసంగిస్తూ సమ సమాజ స్థాపనకు పూలే అలుపెరుగని పోరాటం చేసిన మహాయోధుడన్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, గంటి హరీష్‌మాథుర్, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ రావు మాట్లాడుతూ ఆధునిక భారతదేశంలో మొదటి సామాజిక ఉద్యమకారుడు, గొప్ప సంస్కర్త జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కే. మాధవి, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పీఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పలు సంస్థల ఆధ్వర్యాన

అమలాపురం టౌన్: అమలాపురంలో పలు సంస్థల ప్రతినిధులు పూలేకు ఘన నివాళులర్పించారు. స్థానిక మున్సిపల్ పిల్లల పార్కు వద్ద గల జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ అధ్యక్షతన స్థానిక మున్సిపల్ పిల్లల పార్కు వద్ద పూలే విగ్రహం వద్ద జయంత్యుత్సవం నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ పిల్లల పార్కు సమీపంలోని పూలే విగ్రహం వద్ద పార్టీ పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి, నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి అయితాబత్తుల సుభాషిణి నివాళులర్పించారు.



తాళ్లరేవులో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే సుబ్బరాజు తదితరులు



ముమ్మిడివరంలో జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



అమలాపురంలో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

ఎస్పీ నివాళి

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. పూలే చిత్ర పటానికి జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, జిల్లా ఆర్మ్‌డ్ డీఎస్పీ సుబ్బరాజు, ఎస్బీ సీఐ బి.రాజశేఖర్, డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో..

ముమ్మిడివరం: స్థానిక పోలమ్మ చెరువు గట్టు వద్దగల జైభీమ్ పార్కు బుద్ధ విగ్రహం ఆవరణలో పూలే జయంత్యుత్సవం నిర్వహించారు. ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్, మాతా రమాబాయి మహిళా సంఘం అధ్యక్షురాలు పుణ్యవంతుల రజిని పాల్గొన్నారు.

అల్లవరం హైస్కూల్ సెంటర్లో ..

అల్లవరం: స్థానిక హైస్కూల్ సెంటర్లో జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఎంపీపీ శేషగిరిరావు, ఎంపీడీఓ కృష్ణమోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

అమలాపురం టౌన్: బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక కుడుపూడి ప్రభాకరరావు మున్సిపల్ చిన్న పిల్లల పార్కు వద్ద గల మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా సంఘం అధ్యక్షుడు కేతా భాస్కర రామారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం డివిజన్ గౌరవాధ్యక్షుడు ధర్మాడి గౌరీశంకర్, సంఘం జిల్లా నాయకులు రాజులపూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత పూలే

తాళ్లరేవు: స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని స్థానిక టీడీపీ కార్యాలయంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల తదితరులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ముమ్మిడివరం ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసారు.

ఉప్పలగుప్తంలో తహసీల్దార్ కార్యాలయంలో..

ఉప్పలగుప్తం: ఆదర్శనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తంలో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని పూలే విగ్రహం వద్ద నిర్వహించిన జయంత్యుత్సవంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యానారాయణరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

యానాం సమాచార శాఖ ఆధ్వర్యంలో..

యానాం: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఏఓ మునిస్వామి తదితరులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గిడ్ల చంద్రరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయానికి రేపు శంకుస్థాపన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ టెంపుల్ మేనేజర్ శివానంద దాస్ తదితరులు

అమలాపురం రూరల్: జనుపల్లిలో ఆదివారం అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ఆధ్యాత్మిక దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని రాజమహేంద్రవరం ఇస్కాన్ టెంపుల్ మేనేజర్ శివానంద నిమాయ్ దాస్ తెలిపారు. శుక్రవారం ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం ఇస్కాన్ ప్రతినిధి సత్య గోపీనాథ్ దాస ప్రభు చేతుల మీదుగా ఈ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఆయన రాజమహేంద్రవరం ఇస్కాన్‌కు అనుబంధంగా ఉండి ఇక్కడ మదనగోపాల భజన కుటీర్, అన్నదానం, గోశాల, నిత్యం స్వామీజీల ప్రవచనాలు, వానప్రస్థాశమ నిర్వహణ, విద్యార్థులకు అవసరమైన ఉచిత శిక్షణ వంటి ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని శివానంద దాస్ తెలిపారు. ప్రచారకులు ధర్మ దాసు,రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లపై వేధింపులు తగవు



డిపోలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అమలాపురం రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లపై వేధింపులకు నిరసనగా యునైటెడ్ వర్కర్స్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 52వ రోజు శుక్రవారం గేట్ మీటింగ్‌లో యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వంగా గణపతిరావు మాట్లాడుతూ డిపోలో 1/19 సర్క్యులర్ అమలు చేయాలని, అక్రమంగా సస్పెండ్ అయిన డ్రైవర్ నారాయణను డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షుడు హౌలియా, ప్రధాన కార్యదర్శి పి. మణిరాజు మాట్లాడుతూ కార్మికుల ఆందోళనపై అధికారులు ఇప్పటికీ స్పందించలేదని, దీనికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల్లో 17వ తేదీ నుంచి నిరసనలు తెలియజేస్తామన్నారు. డిపోలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో యాజమాన్యం ఘోరంగా విఫలమైందన్నారు. వాటర్ ప్లాంట్ బాగు చేయించి వేసవికి కార్మికులకు, ప్రయాణికులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, ఆర్టీసీ ఉద్యోగులకు వసతి రూమ్‌లు కల్పించాలని యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉప కార్యదర్శి రంగ ప్రసాద్ డిమాండ్ చేశారు.

హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి

యానాం: కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పలువురికి హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పించి అనంతరం బదిలీ చేస్తూ శుక్రవారం పుదుచ్చేరి సూపరిండెంట్ ఆఫ్ పోలీస్(హెడ్‌క్వార్టర్స్) సుభమ్ ఘోష్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పెంకే గణేష్, సంగాడి శ్రీనివాసులు, వి శ్రీనివాసరావు, బి దుర్గారావు, డి శ్యామ్‌సుందరరావు, ఎస్ వెంకటేశ్వర్లు, టీవీఎస్‌సీ కృష్ణ, పెయ్యాల గణేష్, నాగమ్ ప్రతాప్‌కృష్ణ, పంపన వెంకటరామమూర్తి, సూర్య ప్రకాశరావు, అరదాడి పోషియ్య పదోన్నతి పొందినవారిలో ఉన్నారు. కొందరిని యానాం, మరికొందరిని పుదుచ్చేరికి బదిలీ చేశారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వీరే

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ముమ్మిడివరం నియోజకవర్గంలో నాలుగు మండలాలు, నగర పంచాయతీ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. పార్టీ ముమ్మిడివరం నగర పంచాయతీ అధ్యక్షుడిగా బొంతు సత్యశ్రీనివాస్, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాల అధ్యక్షుడిగా జగతా పద్మనాభరావు(బాబ్జీ), పిన్నమరాజు వెంకటపతిరాజు, నల్లా నరసింహమూర్తి, కాదా గోవిందకుమార్ నియమితులయ్యారు.



బొంతు సత్యశ్రీనివాస్



జగతాపద్మనాభం(బాబ్జీ)



పిన్నమరాజు వెంకటపతిరాజు



నల్లా నరసింహమూర్తి



కాదా గోవిందకుమార్



చిరంజీవి రావు

అమలాపురం మండల అధ్యక్షుడిగా చిరంజీవి రావు

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ అమలాపురం రూరల్ మండల అధ్యక్షుడిగా గుత్తుల చిరంజీవిరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. సాకుర్రు సర్పంచ్‌గా చిరంజీవి రావు పని చేస్తున్నారు. చిరంజీవిరావును వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీలు కుడిపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ శ్రీహరిరామ్‌గోపాల్, మండల సర్పంచ్‌ల సమైఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి, నాయకులు అభినందించారు


ఉత్సాహంగా 'ఫిట్ ఇండియా సైక్లింగ్'



ఫిట్ ఇండియా సైక్లింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్, మల్లాడి, అధికారులు

యానాం: మనిషి జీవితంలో కలిగే ఒత్తిడిని, మెరుగైన ఆరోగ్యాన్ని కల్గించడంతోపాటు, కాలుష్యాన్ని నివారించడంలో రోజువారీ సైక్లింగ్ ఎంతగానో ప్రభావం చూపుతుందని సాయ్ అకాడమీ ఇన్‌చార్జి ఉదయ్‌కుమార్, రీజినల్ డైరెక్టర్ కిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం ఫిట్ ఇండియా సైక్లింగ్ కార్యక్రమం స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్టేడియం పరిధిలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిట్ ఇండియా సైక్లింగ్ కార్యక్రమానికి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, యానాం సబ్‌కోర్టు జడ్జి రాజా మోహన్, జిప్‌మెర్ ప్రధాన వైద్యాధికారి ఆనంద్ రాజ్, ఎస్పీ రాజశేఖరన్ వ్యవసాయశాఖ డీడీ శివ సుబ్రహ్మణ్యన్ పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి



ఆర్ట్ ఫ్యామిలీ బృందంతో సంగీత కచేరి

అమలాపురం టౌన్: స్థానిక భూపయ్య అగ్రహారంలో కొలువై ఉన్న సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకుని ఆర్ట్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో సంగీత కచేరి, కోలాటం ప్రదర్శనలు భక్తులను శుక్రవారం అలరించాయి. ఆంధ్ర ఉషారాణి శిష్య బృందం తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఆర్ట్ ఫ్యామిలీ అధ్యక్షురాలు తాతపూడి సౌమ్య లక్ష్మి, పేరి రఘునాథ్‌చే సంగీత విభావరి, శత శ్లోక రామాయణ పారాయణ వీనుల విందుగా సాగింది. కార్యక్రమంలో దేవస్థానం ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, ఆర్ట్ ఫ్యామిలీ ప్రతినిధులు పేరి వాణి, కొత్తూరి బాల, సంస్కార భారతి ప్రాంత ప్రాచీన కళా ప్రముఖ్ పుత్సా కృష్ణ కామేశ్వర్ పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షల్లో యానాం నవోదయ విద్యార్థుల ప్రతిభ

యానాం: విద్యార్థుల్లో సైన్స్, గణిత శాస్త్రాల్లో ఉచిత శిక్షణనిస్తూ ఐఐటీ, నీట్‌లో ప్రవేశాలకు ఎంతగానో దోహదపడుతున్న ప్రతిష్టాత్మక దక్షిణ ఫౌండేషన్ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో నవోదయ విద్యార్థి డి కౌశిక్ ఎంపికయ్యారు. అదేవిధంగా భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో విద్యార్థుల్లో శాస్త్రీయ పరిశోధనలపై జిజ్ఞాసను పెంపొందించేందుకు నిర్వహించనున్న పోటీకి సంబంధిన ప్రవేశ పరీక్షలో నవోదయ విద్యార్థి ఎం యశ్వంత్‌కృష్ణ ప్రతిభచూపి ఎంపికైనట్లు శనివారం యానాం జవహర్ నవోదయ విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ యస్ శరత్‌చంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీరు ఏప్రిల్ 16న ఐఐటీ అకాడమీ గుంటూరులో నిర్వహించే ఇంటర్వ్యూకి హాజరై తదుపరి శిక్షణ కోసం వెళతారని తెలిపారు. విద్యార్థులను టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది అభినందించారు.

సముద్ర జలాల్లో చేపల వేట నిషేధం

సఖినేటిపల్లి: ఈ నెల 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకూ 61 రోజులు ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి సముద్రంపై చేపల వేట నిషేధం అమలులో ఉంటుందని రాజోలు ఫిషరీస్ ఏడీ సిద్ధార్థవర్ధన్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మెకనైజ్డ్ బోట్లు, మోటరైజిడ్ బోట్లు ద్వారా నిర్వహించే అన్ని రకాల చేపల వేటను ఈ కాలంలో నిషేధిస్తున్నట్టు ఆయన అన్నారు. కాగా చేపల వేట నిషేధం ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ, రొయ్య, పీత జాతుల సంతానోత్పత్తి కాలంలో తల్లి చేప, రొయ్య, పీతలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం, తద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాధించడం అన్నారు. నిషేధ కాలానికి మత్స్యకారులు, పెద్దలు సహకరించాలని కూడా ఆయన కోరారు.

ప్రకృతి వైపరీత్యాలపై నేడు అవగాహన

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంకలో తుఫానులు, వరదలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై శనివారం టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమం నిర్వహించన్నట్లు తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ అధికారులు, పీహెచ్‌సీ సిబ్బంది, పశుసంవర్ధక శాఖ, ఇలా అన్ని శాఖలకు చెందిన అధికారులతో నిర్వహిస్తామన్నారు. శనివారం ఎస్డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందితో మార్క్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తామన్నారు.

వేసవి తాపం..చిరు వ్యాపారులకు వరం

- మండుతున్న ఎండలు
- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- కొబ్బరి బొండం, పుచ్చకాయలు, ముంజులకు పెరిగిన డిమాండ్



ఐ.పోలవరం మండలం మురమళ్ల సెంటరులో పుచ్చకాయల విక్రయాలు



అమలాపురంలో కొబ్బరి బొండాల విక్రయాలు

ఐ.పోలవరం: అకాల వర్షంతో వాతావరణం కాస్త చల్లబడినా వేసవి తాపం పెరుగుతూనే ఉంది. ముందు ముందు ఎండలు మండే అవకాశం ఉండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. మధ్యాహ్నం వేళ మండుతున్న ఎండలను తట్టుకునేందుకు, వేసవి తాపాన్ని తీర్చుకుని, ఉపశమనం పొందేందుకు పుచ్చకాయలు, కర్బూజాలు, మంజులు, కొబ్బరి బొండాలు, ఇతర ఫలాల కొనుగోలు చేస్తున్నారు. గిరాకీ పెరగడంతో చిరు వ్యాపారులు వాటి అమ్మకాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

రోడ్ల చెంతన విరివిగా దుకాణాలు

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో కొబ్బరి బొండాలు, పుచ్చకాయల వ్యాపారం జోరుగా సాగుతోంది. అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీతోపాటు ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం , అమలాపురం, అల్లవరం మండలాల్లో వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మరీ ముఖ్యంగా 216 జాతీయ రహదారిని ఆనుకుని ఐ.పోలవరం మండలం పరిధిలోని ఎదుర్లంక వారధి వద్ద నుంచి అల్లవరం మండలం బోడసుకుర్రు వంతెన వరకు రహదారికి ఇరువైపులా కొబ్బరి బొండాలు, పుచ్చకాయలు, కర్బూజాలు, మంజులు విక్రయించే దుకాణాలు విరివిగా కనిపిస్తున్నాయి. ఈ రహదారి పొడవునా సుమారు 150కు పైగా దుకాణాలున్నాయని అంచనా. వీటితోపాటు అమలాపురం పట్టణంలో కె.అగ్రహారం, సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, బండారులంక, ముమ్మిడివరం సెంటర్లలో పుచ్చకాయలు, కొబ్బరి బొండాల అమ్మకాలు జోరుగా సాగుతోంది. చిరు ఉద్యోగులు వీటిని తోపుడు బండ్లు, సైకిళ్లు, మోటార్ సైకిళ్లు, చిన్న దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు.

పెరిగిన ధరలు

వేసవి తాపంతో పాటు చలువ చేసే పండ్ల ధరలు సహితం పెరిగాయి. మీడియం సైజు కొబ్బరి బొండాం రూ.25 నుంచి రూ.30 వరకు పలుకుతోంది. తమిళనాడు నుంచి వచ్చే పెద్ద సైజు బొండాల ధర రూ.40 వరకు ఉంది. కాయల సంఖ్యతో సంబంధం లేకుండా లీటరు కొబ్బరి నీటిని రూ.100 నుంచి రూ.125 విక్రయిస్తున్నారు. చెట్ల నుంచి బొండాలను తీసేందుకు స్థానిక రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇదే సమయంలో ఇక్కడ దిగుబడిగా వచ్చే బొండాలు కూడా చాలా చిన్నవిగా ఉంటున్నాయి. ఈ కారణంగా పశ్చిమ గోదావరి, తమిళనాడు నుంచి కొబ్బరి బొండాలను తెప్పించాల్సి రావడంతో ధర పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలో కపిలేశ్వరపురం, ముమ్మిడివరం, అయినవిల్లి, పి.గన్నవరం మండలాల్లో పుచ్చకాయల సాగు చేస్తున్నా వచ్చే దిగుబడి స్థానిక డిమాండ్‌కు సరిపోవడంతో లేదు. దీనితో వ్యాపారులు తమిళనాడు, నెల్లూరు ప్రాంతాల నుంచి వాటిని దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. వీటి ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో లేవు. నల్ల పుచ్చకాయ కేజీ రూ.20 చేసి, తెల్ల పుచ్చకాయను కేజీ రూ.30 వరకూ విక్రయిస్తున్నారు. ముంజుల అమ్మకాలు ఇప్పుడిప్పుడే ప్రారంభం కాగా, కార్బూజాలను పండ్ల దుకాణాల వద్ద కూడా విక్రయిస్తున్నారు.